ఆలయ భవనాల్లో కాంట్రాక్టర్ల పాగా

- వ్యాపారాల కోసం ఆలయ గదుల వినియోగం
- రూ.కోట్లు ఆర్జిస్తూ అద్దె కూడా చెల్లించని వైనం
- పట్టించుకోని అధికారులు



టెంకాయ కాంట్రాక్టర్ వినియోగించుకుంటున్న ఆలయ గది



టెంకాయ చిప్పల కాంట్రాక్టర్ వినియోగిస్తున్న షెడ్, ప్లాట్ ఫాం

మంత్రాలయం : ప్రముఖ ఉరకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో కాంట్రాక్టర్ల దర్జా కొనసాగుతోంది. ఓ వైపు భక్తులను నిలువు దోపిడీ చేస్తూ.. మరో వైపు ఆలయ గదులు, షెడ్లను ఎలాంటి బాడులు చెల్లించకుండా అప్పనంగా వాడేసుకుంటున్నారు. వ్యాపారాలు, అడ్డగోలు దోపిడీ చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న అసంతృప్తి

కాంట్రాక్టర్ల దోపిడీని ఇక్కడి అధికారులు ఎలాగో అడ్డుకోవడం లేదు. కనీసం భక్తులను చైతన్యం చేయాలన్న కనీస ధర్మం లేకపోయింది. కారణంగా ఇక్కడి కాంట్రాక్టర్ల దోపిడీకి అడ్డు అదుపు లేకపోయింది. కాగా కాంట్రాక్టర్లు ఆలయ గదులు, స్థలాలు వినియోగించుకుంటున్నా పట్టించుకోకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తులకు నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతుంటే ఇక్కడ షెడ్లను, గదులను కాంట్రాక్టర్లకు ఇవ్వడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం మవుతున్నాయి. కాంట్రాక్టర్లు రూ.కోట్లు దోచుకుంటున్నా ఎందుకు బాడుగ వసూలు చేయడం లేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఆలయ గదులు, స్థలాల్లో దర్జాను చూసి విస్తుపోతున్నారు. ఇకనైనా అధికారులు మేల్కొని గదిని, షెడ్లను స్వాధీనం చేసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

అద్దె చెల్లించకుండా ఆలయ గదుల్లో కార్యకలాపాలు

టెంకాయల విక్రయానికి ప్రభుదేవ అనే కాంట్రాక్టర్ రూ.56,43,111 వేలం దక్కించుకున్నాడు. ఇక్కడ టెంకాయ రూ.20 చొప్పున విక్రయించాల్సి ఉండగా రూ.40లకు వ్యాపారులకు ఇస్తున్నాడు. శ్రావణమాసంలోనే ఆయన ఆదాయం రూ.1.90 కోట్లకుపైగా ఉంటుంది. కాగా కాంట్రాక్టర్ కల్యాణ కట్టను ఆనుకుని ఉన్న ఆలయ గదిలో కార్యకలాపాలు సాగిస్తున్నాడు. ఏడాది కాలంగా ఆ గదిని వినియోగిస్తున్నాడు. అయితే ఆలయానికి మాత్రం పైసా బాడుగ చెల్లించడందు. రూ.కోట్లలో దోపిడీ చేస్తున్నా గదికి చిల్లిగవ్వ ఇవ్వకపోవడం దారుణం. ఇక టెంకాయ చిప్పల కోసం ముత్తన్న అనే కాంట్రాక్టర్ రూ.60,13,116 లక్షలకు టెండర్ వేశాడు. ఆయన అన్నపూర్ణ భోజనశాల ఎదురుగా ఉన్న షెడ్‌తోపాటు ప్లాట్ ఫాంను వినియోగిస్తున్నాడు. అంతేగాక ఆలయ గదులపైన టెంకాయ చిప్పలను ఎండబెట్టుకుంటున్నాడు. ఆయన అదనపు ఆదాయం రూ.2 కోట్ల చిలుకు ఉంటుందని అంచనా. ఈయన కూడా అద్దె చెల్లించడంలేదు.

క్లుప్తంగా

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు



దర్గాలో ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

జలాశయాలను పూర్తిస్థాయిలో నింపుతాం



మాట్లాడుతున్న మున్సిపల్ డీఈఈ కె.గోపీనాథ్

ఆదోని టౌన్: పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు రెండు జలాశయాలను పూర్తిస్థాయిలో నింపుతామని మున్సిపాలిటీ డీఈఈ కె.గోపీనాథ్ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాంజల నల్లచెరువు పూర్తిస్థాయిలో నింపినట్లు తెలిపారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో 200 ఎం.ఎల్. నీటిని మోటార్ల ద్వారా నింపామన్నారు. అయితే రెండు చెరువుల్లో నిల్వ ఉన్న నీరు దాదాపు 45–50 రోజులకు సరిపడతాయన్నారు. పట్టణంలో తాగునీటి కొరత లేకుండా చూస్తామన్నారు. పట్టణంలో 172 మినీ వాటర్ స్కీంలు ఉన్నాయని తెలిపారు. బసాపురం, రాంజల చెరువు ద్వారానే నీటిని రెండురోజులకొకసారి పూర్తిస్థాయిలో సరఫరా చేస్తున్నామన్నారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ



హెచ్.మురవణిలో రైతులకు యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇస్తున్న ఏఓ బి.హేమలత

పెద్దకడబూరు : మండల పరిధిలోని హెచ్.మురవణి, దొడ్డిమేకల రైతుసేవ కేంద్రాలలో మండల వ్యవసాయాధికారిణి సుచరిత ఆధ్వర్యంలో జిల్లా వనరుల కేంద్రం కర్నూలు వ్యవసాయాధికారిణి బి.హేమలత పత్తి, మిరుప, వరి తదితర పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా మిరప, పత్తి, వరి పంటలలో చీడపీడల నివారణ, పోషక లోపాలు, యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై రైతులకు క్షున్నంగా వివరించారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రం సిబ్బంది కిషన్, ఇందు, ప్రవీణ, శిల్ప పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నందవరం : రైతులు పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం ఏఓ హేమలత సూచించారు. గురువారం మండల పరిధిలోని మాచాపురం, ఇబ్రహీంపురంలో మండల వ్యవసాయ అధికారిణి సరిత ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..వర్షాలు ఎక్కువగా కురుస్తుడటంతో పత్తి, మొక్కజొన్న, కంది, వేరుశనిగ, ఉల్లి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు.

వ్యాసరచన పోటీలు

పెద్దకడబూరు : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం జాతీయ నాయకుల చిత్రలేఖనం, భారత రాజ్యాంగం – రాజ్యాంగ పరిరక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు శంకరయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్వాతంత్ర్య సమరయోధుల జీవిత త్యాగాలను తెలుసుకొని రేపటి రోజున దేశ ప్రగతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఎలీషా, హాసన్ తదితరులు పాల్గొన్నారు.

మిద్దె కూలిన వారికి కొత్త ఇళ్లు

గోనెగండ్ల : మండలంలో గత వారం రోజులుగా కురిసిన వర్షాల కారణంగా మిద్దె కూలిన వారికి నూతన ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు హౌసింగ్ ఏఈ షేక్షావలి తెలిపారు. గురువారం మండల కేంద్రం గోనెగండ్లలోని నాయీబ్రహ్మణ కాలనీలో కూలిపోయిన శారదమ్మ మట్టిమిద్దెను, తిప్పనూరు గ్రామంలోని కూలిపోయిన ఖాజాబీ మిట్టిమిద్దెను హౌసింగ్ అధికారులు పరిశీలించారు.

శుభకార్యం

పెద్దకడబూరు : మండల పరిధిలోని కల్లుకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కురువ రాముడు నిర్మించుకున్న నూతన గృహాన్ని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గురువారం ప్రారంభించి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేకు కురువ రాముడుతో పాటు గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు మేళాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, బూత్ కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు. మండలానికి కొత్తగా వచ్చిన మండల విద్యాధికారి – 1 హుసేన్‌బాషా కల్లుకుంట గ్రామంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.

వధూవరులకు ఆశీర్వాదం

కౌతాళం: మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి గురువారం వివిధ వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఉరుకుందలోని కల్యాణ మండపంలో జరిగిన కౌతాళం జెడ్పీ పాఠశాల మాజీ పీఎంసీ చైర్మన్ వడ్డెరాము కుమారుడి వివహం, మేళిగనూరు జరిగిన మల్లికార్జున వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, సర్పంచ్ పాల్‌దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, ఉప సర్పంచ్ తిక్కయ్య, తాహెర్, భీమేష్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగరాలి



ఎమ్మిగనూరు అన్నమయ్య సర్కిల్‌లో జాతీయ జెండాలతో మున్సిపల్ సిబ్బంది



జెండాను ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఆదోని చైర్‌పర్సన్ లోకేశ్వరి



ఎమ్మిగనూరులో జాతీయ జెండాలతో ర్యాలీ చేపట్టిన డిగ్రీ కళాశాల విద్యార్థులు

ఆదోని టౌన్: ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగురవేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి పిలుపునిచ్చారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది మోటార్ల సైకిళ్లతో ప్రదర్శన నిర్వహించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి భీమాస్ సర్కిల్, పాత బస్టాండు, గౌస్ ఆసుపత్రి రోడ్డు గుండా, తిరిగి ఎమ్మిగనూరు రోడ్డు సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని ప్రదర్శన ముగించారు.

జాతీయ సమైక్యతకు కృషి చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: జాతీయ సమైఖ్యతకై ప్రతి ఒక్కరు కృషి చేసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జాతీయ జెండాలతో చేపట్టిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బయలు దేరిన బైక్ ర్యాలీ సోమప్ప సర్కిల్, శివ సర్కిల్, అన్నమయ్య సర్కిల్ మీదుగా పార్క్ రోడ్డు మీదుగా కొనసాగింది. అలాగే స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు డాక్టర్ సుశీలమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు స్వాతంత్ర్య దినోత్సవం గురించి వివరించి అవగాహన కల్పించారు.

కమ్మలదిన్నె వరకు రోడ్డు నిర్మించాలి

- ఎమ్మెల్యే ట్రాక్టర్ ర్యాలీని అడ్డుకున్న సీపీఎం శ్రేణులు



ఎమ్మెల్యే ర్యాలీని అడ్డుకొని రోడ్డు సమస్యపై మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ఎమ్మిగనూరుటౌన్: నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా వుండే ఎమ్మిగనూరు నుంచి కోసిగికి వెళ్లే ప్రధాన రహదారిలోని కమ్మలదిన్నె వరకు శిథిలమైన రోడ్డును పునర్నిర్మించాలంటూ సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మార్కెట్ కమిటీ రోడ్డు వద్ద హైవేపై రాస్తారోకో చేపట్టారు. దీంతో గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. అదే సమయంలో అన్నదాత సుఖీభవపై చేపట్టిన ట్రాక్టర్ ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డిని సీపీఎం శ్రేణులు అడ్డుకున్నారు. శిథిలమైన కమ్మలదిన్నె రోడ్డు పునర్ నిర్మాణంపై సమాధానం చెప్పాలంటూ పట్టుపట్టి నిలదీశారు. దీంతో రోడ్డు నిర్మాణంపై తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి కోసిగి ప్రధాన రహదారిలోని కమ్మలదిన్నె గ్రామం వరకు 12 కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా శిథిలమై గుంతలమయమైందన్నారు. అధికారంలోకి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13నెలలు గడిచినా రోడ్డు నిర్మాణ పనులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, పెద్దకడుబూరు కార్యదర్శి తిక్కన్న, కేవీపీఎస్ మండల కార్యదర్శి దేవదాసు, సీఐటీయూ నాయకులు బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

యూరియా ఇప్పించండి మహాప్రభో!



ఏఓ శేషాద్రితో వాగ్వాదం చేస్తున్న రైతులు

కౌతాళం: రైతన్నలకు ఎక్కడి లేని కష్టాన్ని ఈ ప్రభుత్వం తెచ్చి పెట్టింది. నెల నుంచి యూరియా లేక పోవడంతో రైతులు గురువారం కౌతాళంలో రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రోడ్డు ఎక్కి నిరసన తెలిపారు. రైతుల పంటలకు కావాల్సిన ఎరువులను స్టాక్ లేకుండా చేయడం ఏమిటని రైతులు ప్రశ్నించారు. గురువారం కిసాన్ అగ్రిమాల్ 260బస్తాలు, వీరభద్ర పర్టిలేజర్ షాప్‌కు 260బస్తాలు, తిరుమల ఎంటర్ ప్రైజెస్‌కు 80బస్తాల యూరియా స్టాకు వచ్చింది. నెల తర్వాత ఇంత తక్కువగా యూరియా వస్తే ఎలా రైతులు దీనిని తీసుకోవాలని ఆగ్రహిస్తూ రోడ్డుపై ఆందోళనకు దిగారు.

రైతులపై వ్యవసాయాధికారి చిందులు

ధర్నా వద్దకు వచ్చిన వ్యవసాయాధికారి శేషాద్రి రైతులపై, రైతు కూలీ సంఘం నాయకులపై చిందులు తొక్కారు. పేపర్లో ఫొటోల కోసం ధర్నాలు చేస్తారా? అంటూ రైతులను కించపరుస్తూ మాట్లాడారు. దీంతో రైతులు వ్యవసాయాధికారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు వచ్చి ఇద్దరిని సర్ది చెప్పారు. రైతు కూలీ సంఘం కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ రైతులకు ఇవ్వాల్సి యూరియాను వ్యవసాయాధికారి బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నాడని, ఉప్పరహాల్ దారిలోనే లోడ్‌ను అలాగే పంపించిచాడని ఆరోపించారు. ఏఓను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండు చేశారు.

ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12వేలు ఇవ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతారని, అందువలన ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12వేలు ఇచ్చి కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ, ఏపీ ఆటో యునియన్‌ల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆటో కార్మికులు ధర్నా చేపట్టారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇస్తామన్న హామీ మేరకు వాహన మిత్ర పథకం కింద రెండేళ్లకు గాను రూ.30వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు నబిరసూల్, సాబిర్, యాసిన్, సోమేశ్వర్‌రెడ్డి, అశోక్‌నాయుడు, నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన ఈరన్న నామస్మరణ

- ఉరుకుందలో కొనసాగిన భక్తుల రద్దీ
- ఎటుచూసినా భక్తుజనసంద్రమే



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి



ఎటూ చూసినా భక్తుజనులే



ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి వస్తున్న భక్తులు



దాతకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఈరన్నస్వామి పుణ్యక్షేత్రం ఈరన్న నామస్మరణంతో మారుమోగింది. శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మూడవ గురువారం కావడంతో భక్తుల రద్దీ కొనసాగింది. ఉదయం నుంచే స్వామి దర్శనానికి తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో ఎటుచూసిన భక్త జనసంద్రంగా పుణ్యక్షేత్రం పునితమైంది. ఆలయ పరిసరాలల్లో ఎక్కడ స్థలం దొరికితే అక్కడే భక్తులు ప్రత్యేక వంటకాలను వండి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు తెల్లవారుజామున 4గంటలకు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, బిందుసేవ, పంచామృతాభిషేకం తదితర ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. స్వామి వారి దర్శనం కోసం భక్తులు గంటకు పైగా వేచి ఉండాల్సి వచ్చింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు అతిశీఘ్ర దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం, శీఘ్రదర్శనం ఏర్పాటు చేయడంతో స్వామి దర్శన కార్యక్రమం సాఫీగా సాగిపోయింది. భక్తులకు ఆరు బయటతో పాటు మహాప్రాకార ఆవరణలో కూడా ఫూట్‌ఓవర్‌బ్రిడ్జిల ఏర్పాటుతో ఎలాంటి ఇబ్బంది లేకుండా క్యూలైన్లలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఆలయం అభివృద్ధికి రూ1.55లక్షల విరాళం

జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయం వద్ద జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు జోగులాంబ గద్వాల జిల్లా పట్టణ వాస్తవ్యులైన డాక్టర్ విషోక్ రూ.లక్షను నగదు రూపంలో అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. అలాగే అలూరు వాస్తవ్యులైన చాకలి మల్లేశ్వరమ్మ దేవాలయం అభివృద్ధి కోసం రూ.55వేలను విరాళంగా అందజేశారన్నారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును, ఫొటోను అందజేశారు.





గోనెగండ్లలో వర్షానికి తడిసిన ఉల్లి పంట, వేరుశనగ పంట



నందవరం మండలం పూలచింత వద్ద నీట మునిగిన పత్తి పైరు

రైతు కంట కన్నీరు



మంత్రాలయం మండలం మాధవరంతండాలోని పత్తి పంటలో నిలిచిన వాన నీరు

గోనెగండ్ల /మంత్రాలయం రూరల్/నందవరం : అల్పపీడనం ప్రభావంతో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గోనెగండ్ల మండలంలోని గోనెగండ్ల ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, గాజులదిన్నె, గంజిహళ్లి తదితర గ్రామాల్లో పత్తి, ఉల్లి, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి. బోర్లు, బావుల కింద ముందుగా సాగుచేసిన పత్తి పంటకు కాయ, పూత పట్టింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా పూత, కాయ రాలిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వేరుశనగ కూడా వర్షంకు తడిచిపోయి పంట రంగు మారిపోతుంది. ఉల్లిపంటను కోసేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో వర్షాలు కురుస్తుండడంతో పొలంలో పంటను వదిలేశారు. దీంతో ఉల్లి పంట అంత వర్షానికి తడిచిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రాలయం మండలంలో, నందవరం మండలంలోని నది తీర ప్రాంతాలైన నదికైరవాడి, గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి తదితర గ్రామాలతో పాటు బోర్లు బావి వద్ద ముందుగా సాగు చేసిన పత్తి పంటలు ఈ వానలు పూర్తిగా దెబ్బతీనడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సెల్ టవర్‌ను వెంటనే తొలగించాలి

ఆదోని రూరల్: విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ ఆర్ట్స్ అండ్‌సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను వెంటనే తొలగించాలని పీడీఎస్‌ఓ రాష్ట్ర నాయకుడు తిరుమలేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నెట్‌వర్క్ టవర్‌ను ఏర్పాటు చేయడం వల్ల రేడియేషన్ వల్ల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. ఆర్ట్స్ కళాశాల మేనేజ్‌మెంట్ స్పందించి టవర్‌ను తొలగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివ, వసంత, అర్జున్, సూర్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేస్తాం

ఆదోని రూరల్: మండలంలోని ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేస్తామని ఎమ్మార్పీఎస్ టౌన్ ఇన్‌చార్జ్ మాదాస్ జగన్నాథ్, మాజీ అధికార ప్రతినిధి నరసింహ మాదిగ, మొతలి విజయరాజు మాదిగ తెలిపారు. బుధవారం రాత్రి మండలంలోని సంతెకూడ్లూరు జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా తాయన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్, అధికార ప్రతినిధి ప్రతాప్, ఉపాధ్యక్షులు రాజేష్, శివప్ప, ప్రధాన కార్యదర్శిగా ఎల్లప్ప, శీను, ప్రచార కార్యదర్శిగా స్వామి, మహేష్ , శేఖర్, రామ్‌దాస్, వీరస్వామి, కార్యదర్శులుగా భీమతో పాటు మరికొంతమంది ఎన్నుకున్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణం చేపట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికై కేటాయించిన స్థలం హద్దులు ఏర్పాటు చేసి భవన నిర్మాణం చేపట్టాలని అంబేడ్కర్ భవన నిర్మాణ ఐక్య కార్యాచరణ సభ్యులు, బీసీఆర్ఎఫ్ సంస్థ ప్రతినిధులు సునీల్‌కుమార్, పల్లవి దిలీప్‌కుమార్, ప్రభాకర్, జైభీం ఎంఆర్‌పీఎస్ నాయకులు జడ రవి, ముత్తు సుమాల, మాలమహానాడు నాయకులు నరసన్న, ఏపీ ఎంఆర్‌పీఎస్ నాయకుడు జయన్న కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం ఇచ్చి మాట్లాడారు. స్థలంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ స్థలమనే బోర్డ్‌ను తొలగించాలని, అదేవిధంగా ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న వార్డు సచివాలయాన్ని వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు.